బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 09 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

అమల్లోకి వక్ఫ్ సవరణ చట్టం

- గెజిట్ విడుదల చేసిన కేంద్రం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వక్ఫ్ సవరణ చట్టం-2025 అమల్లోకి వచ్చింది. ఈ చట్టానికి సంబంధించిన బిల్లు ఇటీవల పార్లమెంటు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. దీనిని అమల్లోకి తీసుకువస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. పార్లమెంటు ఉభయ సభల నుంచి ఆమోదం పొందిన ఈ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో వక్ఫ్ సవరణ బిల్లు చట్టంగా మారింది. ఈ చట్టాన్ని నేటి నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్లు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తెలియజేసింది. మరోవైపు, ఈ వక్ఫ్ చట్టంపై కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల ఎంపీలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనికి సంబంధించి మొత్తం 15 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు ఈ నెల 16న విచారణ చేపట్టనుంది. కేంద్ర ప్రభుత్వం కూడా కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. తమ అభిప్రాయాలు తెలుసుకోకుండా ఎలాంటి ఆదేశాలు జారీ చేయవద్దని సుప్రీంకోర్టును కోరింది.

ఫైల్‌ఫోటో

దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో ఐదుగురికి ఉరిశిక్ష

- ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు విధించిన తీర్పును సమర్థించిన హైకోర్టు
- 2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లో జంట బాంబు పేలుళ్లు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో దోషులకు హైకోర్టు ఉరిశిక్ష ఖరారు చేసింది. 2016లో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు విధించిన తీర్పును సమర్థిస్తూ తీర్పునిచ్చింది. ప్రత్యేక కోర్టు తీర్పును సవాలు చేస్తూ దోషులు దాఖలు చేసిన క్రిమినల్ అప్పీల్‌ను ధర్మాసనం కొట్టేసింది. 2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్ నగర్‌లో జంట బాంబు పేలుళ్లలో 18 మంది మృతి చెందగా 131 మందికి గాయాలయ్యాయి. ఐదుగురు దోషులు ప్రస్తుతం తీహాడ్ జైలులో ఉండగా ప్రధాన సూత్రధారి రియాజ్ బక్తల్ ఇంకా పాకిస్థాన్‌లో తలదాచుకుంటున్నాడు.

ఈ ఘటన జరిగిన తర్వాత ఎన్ఐఏ రంగంలోకి దిగి విచారణ జరిపింది. విచారణలో 157 మంది సాక్ష్యాలను రికార్డు చేసింది. ఈ ఘటనలో ఇండి యన్ ముజాహిద్ ఉగ్రసంస్థ సహ వ్యవస్థాపకుడు యాసిన్ భత్కల్ ప్రధాన నిందితుడిగా తేలింది. నిందుల్లో అసదుల్లా అక్తర్, వకాస్, తెహసీన్ అక్తర్, ఎజాజ్ షేక్, సయ్యద్ మక్బూల్‌ని నిందితులుగా గుర్తించారు. మూడేళ్లు ఈ కేసులు విచారించిన ఎన్ఐఏ స్పెషల్ కోర్టు విచారణ తర్వాత నిందితులకు మరణశిక్షను విధిస్తూ తీర్పును వెలువరించింది. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన యాసిన్ భత్కల్‌ను 2013లో నేపాల్ సరిహద్దుల్లో పట్టుకున్నారు. ఢిల్లీ, దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కేసు సహా పలు కేసుల్లో దోషిగా తేలగా తిహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. 2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్టాప్ వద్ద రాత్రి 7 గంటల సమయంలో మొదటి పేలుడు జరిగింది. క్షణాల వ్యవధిలోనే కోణార్క్ థియేటర్ సమీపంలోని ఏ-1 మిర్చి సెంటర్ వద్ద రెండో పేలుడు సంభవించింది.

రాజన్న ఆలయ విస్తరణకు శ్రీకారం..

- జూలై నుండి ఆలయ విస్తరణ పనులు ప్రారంభం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

దక్షిణ కాశీగా పేరుగాంచిన రాజన్న ఆలయ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారము హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధ్యక్షతన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ఆలయ విస్తరణ పనులపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఓఎస్డీ సోమరాజు సమీక్ష సమావేశము నిర్వహించినారు. ఈ సమీక్షలో కమిషనర్ శ్రీధర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ విస్తరణ పనులకు సంబంధించిన నమూనాను పరిశీలించి కొన్ని మార్పులు, చేర్పులు రెండు రోజులలోగా చివరి ప్లాన్ తయారు చేయవలసిందిగా ఆర్కిటెక్ట్ ను ఆదేశించినారు. ఇట్టి పనులు చేపట్టుటకు ఆర్ అండ్ బీ శాఖ మరియు దేవాదాయ శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయుటకు నిర్ణయించనైనదని తెలిపారు. ఈ నెల 15 తేదిన కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆర్ అండ్ బీ అధికారులు కలసి వేములవాడ ఆలయ పర్యటనకు వస్తారని, క్షేత్రస్థాయి పర్యటన చేసిన తదుపరి చివరి ప్లాన్ పైన తగు సూచనల విషయములో మరోసారి శృంగేరీ పీఠం వారి వద్దకు వెళ్ళుటకు నిర్ణయించినామని,ఈ నెల 20 లోపు పీఠాధిపతి సూచనలు తీసుకొని ఈ నెల 21వ తేదీన టెండరు

ప్రక్రియ చేపట్టుటకు ఆర్ అండ్ బీ శాఖ అధికారులను ఆదేశింనట్లు పేర్కొన్నారు..

రాజన్న దర్శనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు..

రాజన్న దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బంది కలిగించకుండా జూన్ 15 నుండి శ్రీ భీమేశ్వర స్వామి ఆలయములో భక్తులకు దర్శనములు, అభిషేకములు, అన్నపూజాలు, కోడె మొక్కుబడి మొదలగునవి జరిపించుటకు నిర్ణయించినామని అన్నారు. జూన్ 10 లోపు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయము వద్ద భక్తుల సౌకర్యార్థము క్యూలైన్లు ఏర్పాటు మరియు వేద పాఠశాల ముందు స్థలములో శృంగేరీ శంకర మటం ఖాళీ స్థలములో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి అభిషేకములు, నిత్య కళ్యాణము మొదలనునవి నిర్వహించుటకు వీలుగా తగు ఏర్పాట్లు చేయుటకు ఆలయ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశములో రాజేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ (సివిల్), ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ స్థపతి, దుర్గాప్రసాద్, ఆలయ ఈవో కే వినోద్,. టి రాజేష్, రఘునందన్, శరత్ కుమార్, సురేష్ అర్చకులు దేవస్థానము వారు పాల్గొన్నారు.

ఫలక్ నుమా ఎక్స్ ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

బలగం టీవీ, శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లా పలాస సమీపంలో ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్ బోగీలు విడిపోవటంతో ప్రయాణికులు కంగారుపడ్డారు. సుమారు గంట పాటు ఆందోళన చెందారు. ఒక రకంగా మంగళవారం భారీ ప్రమాదం తప్పింది. వేగంగా ఫలక్ నుమా ఎక్స్ ప్రెస్ దూసుకుపోతుంటే.. ఆకస్మాత్తుగా ట్రెయిన్ నుంచి బోగీలు విడిపోయాయి. ఇంజన్తో కొన్ని బోగీలు వెళ్లిపోతే.. మరికొన్ని బోగీలు విడిపోయాయి. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి సికింద్రాబాద్ నుంచి హౌరా ఫలక్ నుమా ఎక్స్ ప్రెస్ మందస-సున్నాదేవి మధ్యలోకి చేరే సరికి బోగీలు విడిపోయాయి. ఈ విషయం తెలియడంతో వెంటనే రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. 8వ బోగీ వద్ద ప్రమాదం జరగ్గా.. 15 బోగీలు ఇంజనుతో సహా వెళ్లిపోయాయి. ఘటన స్థలానికి రైల్వే సిబ్బంది చేరుకుంది. విడిపోయిన భోగీలను ట్రెయిన్ కు అమర్చారు. ఈ ఘటనలపై రైల్వే అధికారులు విచారణ చేపట్టారు.

అసెంబ్లీలో జ్యోతిభాఫూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

- అనుముల ఇంటలీజెన్స్‌తోనే ప్రమాదం
- జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత
- ధర్నా చౌక్ వద్ద ధర్నా

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ప్రమాదమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, వాస్తవానికి అనుముల ఇంటెలిజెన్స్ (ఏఐ)తోనే ప్రమాద మని బీఆర్ఎస్ శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు కోసం కవిత మంగళవారం ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాలలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనేవి కేవలం మాటల్లోనే ఉన్నాయన్నారు. దళిత నేత, రాజస్థాన్ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎమ్మెల్యే టికారాం జుల్లి ఇటీవల శ్రీరామనవమి నాడు రాముడి గుడికి వెళ్తే గుడి మైలపడిందని సంప్రోక్షణ చేశారన్నారు. అటువంటి దౌర్భాగ్యమైన పరిస్థితి దేశంలో ఉండడం దురదృష్టకరమన్నారు. అలాగే అయోధ్య రాముడి గుడి కడితే గిరిజన మహిళ అయిన రాష్ట్రపతిని ఆహ్వానించలేదని తెలిపారు. బాన్సువాడ ప్రాంతంలో ఒక చాయ్ దుకాణంలో రెండు గ్లాసుల పద్ధతి ఉందని, బీసీలు, ఎస్సీలకు వేరే కప్పుల్లో చాయ్ పోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకే కాదు బీసీలకు కూడా అనేక సందర్భాల్లో ఇప్పటికీ అవమానాలు జరుగుతున్నాయని తెలిపారు. బీసీల కోసం ఎందుకు ధర్నాలు చేస్తున్నారని కొంత మంది ప్రశ్నిస్తున్నారని.. అయితే బీసీల సమస్యల పట్ల ఆవేశం, ఆవేదన నుంచి పుట్టికొచ్చినవే ఈ ధర్నాలు అన్నారు. ఈబ్ల్యూఎస్ అమలుతో 50 శాతం రిజర్వేషన్ పరిమితి తొలగిపోయింది కాబట్టి 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించినా కోర్టులు అడ్డుకోలేవన్నారు. బీసీ బిల్లుల ఆమోదానికి చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రయత్నం చేస్తూ బీజేపీపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలంటే ప్రజా ఉద్యమాలే మనకు మార్గం అన్నారు.

కుల వివక్ష తొలగింపునకు జ్యోతిబాఫూలే తీవ్ర కృషి చేశారని, తాము పొద్దుపోక విగ్రహం పెట్టాలని అడుగుతలేమని, ఆయన స్ఫూర్తిగా నిలవాలని అడుగుతున్నామన్నారు. 15 ఏండ్ల కిందట అంబేద్కర్ విగ్రహం అసెంబ్లీలో పెట్టాలని కూడా డిమాండ్ చేశామని గుర్తు చేశారు. ఏప్రిల్ 11న జోతిబాఫూలే జయంతి రోజున ఆయన విగ్రహాన్ని అంబేద్కర్ విగ్రహం పక్కన పెట్టాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్ల బిల్లు పాసై నాలుగు వారాలు గడిచిందని, మరి ఆ బిల్లు ఎవరి దగ్గర ఉందో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీని కాపాడడానికి ఆ బిల్లు కేంద్రానికి పంపలేదని ఆరోపించారు. బిల్లు పంపి ఉంటే అపాయింట్మెంట్ వస్తుండేనని.. బీజేపీతో లాలూచీ లేకపోతే బిల్లు ఆమోదమయ్యే విధంగా చూడాలని కోరారు. కుల గణన నివేదిక అసెంబ్లీలో పెట్టాలని డిమాండ్ చేశారు. కుల గణనను ఏఐ ద్వారా తేల్చడం ఏంటని.. ఏఐ అంటే అనుముల ఇంటెలిజెన్స్ అని ఎద్దేవా చేశారు. దాన్ని వాడి బీసీలకు అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. అనుముల ఇంటెలిజెన్స్‌తో హెచ్‌సీయూ విద్యార్థులను కూడా మోసం చేస్తున్నారని ఆరోపించారు.కర్ణాటకలో పదేండ్ల క్రితం కుల గణన చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. ఈ ధర్నా శాంపుల్ మాత్రమేనని.. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. మీలా దొంగ దీక్షలు, దొంగ ధర్నాలు చేయబోమన్నారు.బీసీ రిజర్వేషన్లపై న్యాయంగా పోరాడితే వారితో కలిసి పోరాటానికి సిద్ధమని తెలిపారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అహ్మదాబాద్‌లో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కూడా సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబర్మతీ ఆశ్రమాన్ని సీఎం బృందం సందర్శించింది. మహాత్ముడికి నివాళులు అర్పించారు. అక్కడే సీఎం రేవంత్‌రెడ్డి చరఖా తిప్పి నూలు వడికారు. అక్కడి ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు.

రేపటి నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

- ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు
- చట్టసవరణతో డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్: రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు మెరుగైన సేవలందిం చేందుకు ఈ నెల 10 నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకురాబోతున్నామని రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 22 సబ్ రిజి స్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్టు తెలిపారు. మిగతా 122సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దశలవారీగా అమలు చేయనున్నట్టు తెలిపారు. స్లాట్ బుకింగ్ వల్ల గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. డబుల్ రిజిస్ట్రేషన్లను నివారించడానికి చట్టాన్ని సవరించబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ చట్టంలో కొత్తగా సెక్షన్స్ 22 కి సవరణ చేస్తూ సెక్షన్ 22-బి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒకే సమయంలో ఎక్కువ దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం సమర్పించడం వల్ల జరిగే జప్యాన్ని నివారించడానికి రోజు వారి పని వేళలను 48 స్లాట్లుగా విభజించడం జరిగిందని చెప్పారు. స్లాట్ బుక్ చేసుకోని వారికోసం అత్యవసర సందర్భాల్లో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు, ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను అనుమతిస్తారనీ, నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులు స్వీకరిస్తారని తెలిపారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న కార్యాలయాల్లో అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామనీ, ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లను నియమించినట్టు పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రీ ఆర్గనైజేషన్ చేస్తున్నామని చెప్పారు. ముందుగా రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట సరూర్ నగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధిని విలీనం చేయడం జరిగిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రజలు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా దస్తావేజులను తయారు చేసుకోవడానికి వెబ్ సైట్ లో ఒక మాడ్యూల్ ని ప్రవేశపెట్టామని చెప్పారు. సేల్ డీడ్ దస్తావేజుల కోసమే ఈ సౌకర్యం మొదటి దశలో అందుబాటులో ఉంటుందని తెలిపారు. దశల వారీగా దీన్ని అన్నింటికి వర్తింపజేస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఇ-సంతకం ప్రవేశపెడుతున్నామనీ, ఈనెల చివరిలోగా అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

సంఘ్ సిద్ధాంతాలు పటేల్ భావజాలానికి వ్యతిరేకం

- కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ముందస్తు కుట్ర ప్రకారమే జాతీయ యోధులపై తప్పుడు ప్రచారానికి తెగబడ్డాయని కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ ఆలోచనలకు, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ భావజాలానికి అస్సలు పొంతనే లేదన్నారు. చివరకు ఆర్ఎస్ఎస్‌ను పటేల్ బ్యాన్ కూడా చేయించారని ఖర్గే గుర్తు చేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎలాంటి పాత్రనూ పోషించని ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థ పటేల్ వారసత్వాన్ని క్లెయిమ్ చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఆయన పేర్కొన్నారు. గుజరాత్ అహ్మదాబాద్‌లోని సర్దార్ పటేల్ మెమోరియల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రారంభోపన్యాసం చేస్తూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఉన్న ప్రధాన సమస్యల నుంచి ప్రజల చూపును మరల్చేందుకే మతపరమైన అంశాలను బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు లేవనెత్తుతున్నాయన్నారు. దేశంలోని సహజ వనరులను కొద్ది మందికి అప్పగించడం ద్వారా, ప్రభుత్వం పై పట్టును కొనసాగించాలనే దురుద్దేశంతో కేంద్ర సర్కారు ఉందన్నారు. "కాంగ్రెస్ పార్టీ భారత దేశానికి గత 140 ఏళ్లుగా సేవ చేస్తోంది. కానీ ఆర్ఎస్ఎస్, బీజేపీ వాళ్లకు చెప్పుకోవడానికి, చూపించుకోవడానికి ఏమీ లేవు. ఎందుకంటే దేశం కోసం వాళ్లేం చేయలేదు" అని ఖర్గే ధ్వజమెత్తారు.

జాతీయ హీరోలకు వ్యతిరేకంగా 'పక్కా కుట్ర'

బీజేపీ, ఆర్ఎస్ఎస్ జాతీయ హీరోలకు వ్యతిరేకంగా 'పక్కా కుట్ర' సాగించాయని మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సిద్ధాంతం ఆర్ఎస్ఎస్ భావజాలానికి భిన్నమైనదని ఆయన స్పష్టం చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో 'ఏమాత్రం పాత్ర లేని' సంస్థ ఆయన వారసత్వం గురించి చెప్పుకోవడం హాస్యాస్పదం అనిఅన్నారు. 'మరొక వైపు స్వల్ప జనాధిపత్యం దేశ వనరులను గుప్పిటలోకి తీసుకోవడం ద్వారా ప్రభుత్వాన్ని నియంత్రించే పథంలో సాగుతోంది' అని ఆయన పేర్కొన్నారు.

సర్దార్ పటేల్‌ను ఖర్గే ఉటంకిస్తూ, సంస్థాగత బలం ప్రధానమైనదేనని, సంస్థ లేకుండా కేవలం సంఖ్యాబలం అర్థరహితం అని అన్నారు. గత అనేక సంవత్సరాలుగా జాతీయ హీరోలు పలువురి విషయమై పక్కా కుట్ర సాగిస్తున్నారని ఆరోపించారు. 'గడచిన 140 సంవత్సరాలుగా దేశానికి సేవ చేసిన, దేశం కోసం పోరాడిన మహోన్నత చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఒక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. తమ విజయాలుగా చూపేందుకు ఏమీ లేనివారే ఈ పని చేస్తున్నారు' అని ఖర్గే విమర్శించారు. వారు ఒక నాణానికి రెండు వైపుల వారనేది వాస్తవం. వారి మధ్య సుహృద్భావపూర్వక సంబంధాలు ఉన్నాయనేందుకు దాఖలాలుగా అనేక ఘటనలు, పత్రాలు ఉన్నాయి' అని ఖర్గే స్పష్టం చేశారు. 'వారిద్దరి మధ్య దాదాపు రోజూ ఉత్తరప్రత్యుత్తరాలు సాగుతుండేవి. నెహ్రూజీ అన్ని విషయాలపై ఆయన సలహా తీసుకుంటుండేవారు అని అన్నారు.

వివాదానికి తెర

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ డ్యాం భద్రత విషయంలో వారం రోజులుగా నడుస్తున్న హై డ్రామాకు మంగళవారం తెర పడింది. 2023లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాగార్జున సాగర్ డ్యాంపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఏర్పడిన వివాదం కారణంగా డ్యాం భద్రతా విధులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక పోలీసు దళాల నుంచి సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాల ఆధీనంలోకి వెళ్లిపోయింది. డ్యాంపై 13వ గేటు వరకు తెలంగాణ వైపు 39వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ బలగాలు, 13వ గేటు నుంచి 234వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ బలగాలు విధులను నిర్వహించాయి. అయితే, కొన్ని రోజులుగా డ్యాం భద్రత విధులను గతంలోలా తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు దళాలకు అప్పజెప్పి తిరిగి వెళ్లనున్నాయని ప్రచారం జరిగింది. కొన్ని నెలల కిందట సాగర్ డ్యాం భద్రత విధుల నుంచి ఉదయం వైదొలిగిన 39వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఒక్క రోజులోనే తిరిగి విధుల్లో చేరింది. నాలుగైదు రోజులుగా నాగార్జునసాగర్ డాం భద్రత విధుల నుంచి తాము వైదొలిగి వెళుతున్నట్టు.. దానికి సంబంధించి ఉత్తర్వులు వస్తున్నట్టు ప్రచారం జరిగింది. మంగళవారం సీఆర్‌పీఎఫ్ ఉన్నత స్థాయి అధికారుల నుంచి ఉత్తర్వులు రావడంతో నాగార్జునసాగర్ డ్యాం తెలంగాణ వైపు విధులు నిర్వహిస్తున్న 39వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ తాము భద్రతా విధులు నుంచి వైదొలుగుతున్నట్టు ఇరిగేషన్ ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం రాత్రి వారి రవాణాకు సంబంధించిన వాహనాలు క్యాంపు కార్యాలయానికి చేరుకోవడంతో సాగర్ నుంచి వెళ్లిపోవడానికి సమాయత్తం అయ్యారు. అయితే, కేంద్ర బలగాలు సాగర్ డ్యాం భద్రతా విధుల నుంచి వైదొలిగిన వెంటనే తెలంగాణ ప్రత్యేక పోలీసు బలగాలైన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డ్యాంను తమ ఆధీనంలోకి తీసుకోవాల్సి ఉండగా, ఆంధ్ర వైపున భద్రతా విధులు నిర్వహిస్తున్న 234వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ కేంద్ర బలగాల ఉన్నత స్థాయి అధికారుల ఉత్తర్వుల మేరకు తెలంగాణ వైపు కూడా అంటే నాగార్జునసాగర్ డ్యాంను పూర్తిస్థాయిలో తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. దీంతో నాగార్జునసాగర్ డ్యాం పూర్తిస్థాయిలో ఆంధ్ర ఆధీనంలోకి వెళ్లిందని ప్రచారం జరిగింది. ఈ విషయంలో కేంద్ర బలగాల అధికారులుగానీ, స్థానిక ఇరిగేషన్ అధికారులుగానీ ఏమీ చెప్పలేకపోయారు. ఈ సందర్భంగా స్థానిక ఇరిగేషన్ అధికారులు మాత్రం నాగార్జున సాగర్ డాం నిర్వహణ తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖనే నిర్వహిస్తుందని చెప్పున్నారు. అయితే, కృష్ణా నది యాజమాన్య బోర్డు(కెఆర్ఎంబి) నిర్ణయం మేరకు నాగార్జునసాగర్ డ్యాంపై ఆంధ్ర వైపున భద్రతా విధులు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలే తెలంగాణ వైపు కూడా బాధ్యతలను నిర్వర్తిస్తాయన్నారు.

కంచ గచ్చిబౌలి భూముల వెనుక వేల కోట్ల బాగోతం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కంచ గచ్చిబౌలి భూముల వెనుక వేల కోట్ల బాగోతం ఉందని... కంచ గచ్చిబౌలి భూముల వెనుక బీజేపీ ఎంపీ కూడా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వేల కోట్ల రూపాయాల బాగోతం 2,3 రోజుల్లో చెబుతానని చెప్పారు. రాష్ట్రంలో నెగెటివ్ పాలసీలు, నెగెటివ్ పాలిటిక్స్ నడుస్తున్నాయి అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ఏఐ వీడియోల పేరుతో తప్పించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందన్నారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. "మాజీ సర్పంచ్ నుంచి మాజీ సీఎం వరకు కేసులెలా పెట్టాలని చూస్తున్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంలో మేం లేము. హెచ్‌సీయూ విద్యార్థులపై కేసుల ఉపసంహరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. కేసుల ఉపసంహరణ సరిపోదు.. జంతువధ కారకులపై కేసులు పెట్టాలి. సోషల్ మీడియాలో మాపై ఎదురుదాడి చేయిస్తున్నారు. భారీగా ఖర్చు చేసి టూల్ కిట్ సాయంతో ఎదురుదాడికి పాల్పడుతున్నారు. బీసీ రిజర్వేషన్లు అసాధ్యమనే కాంగ్రెస్ దీక్షకు రాహుల్ గాంధీ వెళ్లలేదు" అని కేటీఆర్ గుర్తు చేశారు. రెండు జాతీయ పార్టీల జుట్టు ఢిల్లీ చేతుల్లోనే ఉంటుంది. ఒకరు చెప్పులు మోస్తే.. ఇంకొకరు బ్యాగులను మోస్తున్నారు. 16, 17 నెలలైనా మంత్రివర్గాన్ని విస్తరించుకునే పరిస్థితి లేదు. ఇన్నిసార్లు ఢిల్లీ వెళ్లినా ఒక్క రూపాయి కూడా రాలేదు. మీనాక్షి నటరాజన్ సచివాలయంలో సమీక్షలు చేస్తున్నారు. రేవంత్ విఫల సీఎం కాబట్టే కాంగ్రెస్ హైకమాండ్ జోక్యం చేసుకుంటుంది. నాకు దక్కనిది ఎవరికీ దక్కకూడదని రేవంత్ ఆలోచిస్తున్నారు.